క్లుప్తంగా

కట్టువాపల్లిలో పల్లెనిద్ర



మాట్లాడుతున్న ఎస్ఐ అజయ్‌కుమార్

దొరవారిసత్రం : మండలంలోని కట్టువాపల్లిలో శుక్రవారం రాత్రి స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్థానికులతో సమావేశమై రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం, సైబర్ క్రైమ్, శక్తి యాప్, స్మార్ట్ లాక్, మహిళలకు సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని చిన్నపిల్లలకు స్టోరీ బుక్స్, విద్యాసామగ్రిని అందజేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు డ్రిల్లింగ్ చేస్తున్న దృశ్యం

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పట్టణంలోని 4వ వార్డులో కుమ్మరి మిట్ట ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయంపై వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ స్పందించి శనివారం కాలనీ బోరు వేయించి.. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నారాయణ మాట్లాడుతూ బోరు మంజూరు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియతో పాటు కమిషనర్ వెంట్రామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

పొదుపు మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న షహనాజ్

కలువాయి(సైదాపురం): మండల కేంద్రం కలువాయిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కార్యక్రమంపై సఖి అడ్మిన్ షహనాజ్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ఎవరైనా మహిళలు ఇబ్బందులకు గురయితే నెల్లూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలోని సఖి వన్ స్టాప్ కేంద్రానికి వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చని కోరారు. మహిళలకు అన్యాయం జరిగితే వారికి చట్టపరమైన, న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రత్నమ్మ, రాపరు సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ కొండమ్మ, ఏపీఎం రవి తదితరులు ఉన్నారు.


వైభవంగా బ్రహ్మోత్సవాలు ముగింపు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

సైదాపురం: మహావిష్ణువు వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా శనివారం ముగిశాయి. శ్రీమహావిష్ణువు ఉత్సవమూర్తిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కృష్ణారెడ్డిపల్లికి దగ్గరలో ఉన్న వైకుంఠపురంలో వెలసిన శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మీదేవి అమ్మవార్ల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామి వారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం ఆలయం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో అత్యంత వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తాతయ్యస్వామి భక్తులకు పలు సందేశాలను అందజేశారు.

మినీ ట్రక్కు దగ్ధం



దగ్ధమైన మినీ ట్రక్కు

రాపూరు: రాపూరు –చిట్వేలి మార్గమధ్యంలో మినీ ట్రక్కు శనివారం కొంత మేర దగ్ధమైనట్టు అగ్నిమాపకశాఖ అధికారి కుప్పయ్య తెలిపారు. రాజంపేట నుంచి గూడూరుకు మూగజీవాలు కొనుగోలుకు వెళ్తున్న మినీ ట్రక్కు రాపూరుకు 13 కిలోమీటర్ల దూరంలోని ఘాట్ రోడ్డులో ఒక్కసారిగా వాహనంలో నుంచి పొగలు వ్యాపించి, మంటలంటుకున్నాయని తెలిపారు. డ్రైవర్ నరేష్ చాకచక్యంగా తప్పించుకున్నారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు చెప్పారు.

నిమ్మ ఢమాల్!

కాపూ లేక.. ఆశించిన ధరలూ రాక నిమ్మ రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంట పెట్టుబడీ చేతికందక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అమెరికా ఆంక్షల కారణంగా ఎగుమతులు పడిపోవడంతో ఒకటికి సగానికి తెగనమ్ముకుంటున్నారు. దీనికి తోడు బయట వ్యాపారులను రానీయకుండా దళారులు సిండికేట్‌గా ఏర్పడి అడ్డుకోవడంతో విధిలేని పరిస్థితుల్లో స్థానికంగానే విక్రయాలు చేస్తూ చేతులు కాల్చుకుంటున్నారు.



నిమ్మ మార్కెట్టులో గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కాపూ లేదు.. ధరలూ లేవు

- వేసవిలోనూ పెరగని నిమ్మ ధర
- తగ్గిపోయిన కాపు
- అమెరికా ఆంక్షలతో పడిపోయిన ఎగుమతి
- అవస్థల్లో అన్నదాతలు

చిల్లకూరు: వేసవి వచ్చినా నిమ్మకు డిమాండ్ లేకుండా పోయింది. వ్యాపారులు చెప్పిన ధరే శాసనంగా మారింది. ముఖ్యంగా గూడూరు మార్కెట్‌లో రెండు రోజుల పాటు ధర పెంచడం.. ఆపై వ్యాపారులు సిండికేట్‌గా మారి అమాంతం ధరలు తగ్గించేయడం రివాజుగా మారుతోంది. గత వారం రోజులుగా లూజు బస్తా రూ.4,800 నుంచి రూ.6 వేల వరకు మాత్రమే పలుకుతోంది. దీనికితోడు ఈ ఏడాది నిమ్మ దిగుబడి కూడా అంతంతమాత్రంగా ఉండడంతో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది.



బస్తాలోకి నిమ్మ కాయలు నింపుతున్న కూలీలు

గత ఏడాది బస్తా రూ.12 వేల పైమాటే!

గత ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉండేవి. వేసవిలో లూజ్ బస్తా రూ.12 వేలకుపైగా పలికింది. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ నిమ్మధరలు ఆశాజనకంగా పెరిగేవి. కానీ ఈ యేడు ధర సగానికి సగం పడిపోయింది. లూజ్ బస్తా కాయల సైజును బట్టి రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలుకుతోంది.

ఆంక్షలు.. అగచాట్లు

అమెరికా విధించిన సుంకాల సాకును నిమ్మ వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. సహజంగా గూడూరు నిమ్మకు ఢిల్లీలో మంచి గిరాకీ ఉంది. ఎక్కువ జూస్ వస్తుండడంతో ఏటా కొన్ని వేల టన్నుల నిమ్మ ఎగుమతి అయ్యేది. కానీ ప్రస్తుతం గూడూరు నుంచి అతి తక్కువ మొత్తంలో ఎగుమతి అవుతోంది. సుంకాల కారణంగా ఇతర దేశాలకు నిమ్మ ఎగుమతి ఆగిపోయిందని, ఫలితంగా ఢిల్లీ మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి ఇబ్బడిముబ్బడిగా కాయలు వస్తున్నాయని వ్యాపారులు బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో చేసేది లేక మార్కెట్‌లోని కార్యనిర్వాహక బృందం వారు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

జిల్లా సమాచారం

నిమ్మ సాగు విస్తీర్ణం:	35వేల ఎకరాలు
రైతులు:	15వేల మందికి పైగా..
గతంలో దిగుబడి:	400 టన్నులు
ప్రస్తుత దిగుబడి:	180 టన్నులు

గూడూరు నిమ్మ మార్కెట్ సమాచారం

గతంలో ఎగుమతి:	15 లారీలు (ఒక లారీకి 25 టన్నులు)
ప్రస్తుతం:	5 నుంచి 7 లారీల వరకు

అంతా వాట్సాప్ ద్వారానే

నిమ్మ మార్కెట్టు వ్యాపారమంతా వాట్సాప్ ద్వారానే సాగుతోంది. గతంలో నిమ్మ రైతు నేరుగా మార్కెట్టుకు తీసుకొచ్చి వ్యాపారులకు ఇచ్చిన తరువాత అక్కడ జరిగే వేలంలో పాల్గొని తన నిమ్మకాయలకు ఎంత మేర ఆదాయం వస్తుందనే విషయాన్ని తెలుసుకుని వెళ్లేవారు. కోవిడ్ నుంచి అంతా ఫోన్ ద్వారానే వ్యాపారులు నిమ్మ క్రయ, విక్రయాలు చేస్తున్నారు. దీంతో రైతుకు ఎంత మేర ఆదాయం వస్తుందో తెలుసుకోలేక పోతున్నారు. అప్పుడప్పుడూ తనిఖీలు చేయాల్సిన అగ్రికల్చర్ మార్కెట్టు కమిటీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కాపు లేదు



గత ఏడాది సెప్టెంబర్ నుంచి అప్పుడప్పుడూ వర్షాలు పడ్డాయి. చెట్టుకున్న పూత మొత్తం రాలిపోయింది. దిగుబడి కూడా తగ్గిపోయింది. ఇప్పుడు పూత వచ్చినా ఎండ తీవ్రతకు అది రాలి పోతోంది. ధరలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఏం చేయాలో తెలియడంలేదు.

– వేమయ్య, నిమ్మరైతు, చిల్లకూరు

ధర లేదు



నిమ్మ ధరలు ఢిల్లీ మార్కెట్టుకు అనుగుణంగా కొనసాగుతుంటాయి. అక్కడ ధరలు ఎలా ఉన్నాయి అనే విషయం రైతులకు తెలియదు. స్థానికంగా ఉండే వ్యాపారులు ఏమి చెబితే అదే ధర. గూడూరు, పొదలకూరులోని మార్కెట్లలో అనుకున్నంత మేర వ్యాపారం లేదు.

– దామోదరరాజు, రాజుల ఎరుగుంటపాళెం, సైదాపురం మండలం

గత ఏడాది కిలో రూ.130 పలికింది



గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కేజీ నిమ్మ రూ.110 నుంచి రూ.130 వరకు పలికింది. ఈ ఏడాది అదే నిమ్మ ధర రూ.60 నుంచి రూ.90కి పడిపోయింది. దీనికి తోడు కాయాలు తక్కువగా ఉంటుండడంతో మార్కెట్టుకు కూడా ఆటోలోనే పంపుతున్నాం.

– నరసయ్య, నిమ్మరైతు, కుందకూరు, గూడూరు మండలం

ఎగుమతులు లేకపోవడంతోనే..

ఈ ఏడాది కాపు అంతంతమాత్రంగా ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీ మార్కెట్టుకు కాయలు వస్తుండడంతో ఇక్కడ వ్యాపారులు అంతంతమాత్రంగా ఎగుమతి చేస్తున్నారు. ఇలాంటి సమయంలో నిమ్మ ఉత్పత్తులతో చేసే వివిధ రకాల పరిశ్రమలు అందుబాటులోకి వస్తే రైతులకు నిరంతరాయంగా ఆదాయం వస్తుంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

– ఎం.రవీంద్రరెడ్డి, నిమ్మరైతు, తిమ్మసముద్రం, గూడూరు మండలం

పిల్లలపై నిఘా పెట్టండి



నీటి గుంట వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రూరల్ పోలీసులు

గూడూరురూరల్ : వేసవి సెలవులు కావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కాలువలు, గుంటల వద్ద శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల కారణంగా చిన్న పిల్లలు ఇంటి వద్ద తల్లిదండ్రులను ఏమార్చి సరదా కోసం ఈతకు వెళ్తుంటారని తెలిపారు. ఈ సమయంలో పెద్దల పర్యవేక్షణ లేకుండా ఈత కొట్టడం ద్వారా పలు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లలను ఒంటరిగా ఈతకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు ఎక్కువగా ఈత కొట్టే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

నివాళి

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇసనక రాజవర్ధన్‌రెడ్డి తల్లి రుక్మిణమ్మ (81) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి రుక్మిణమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం రాజవర్ధన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి వేణు, బద్దెపూడి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్-30 క్రికెట్ లీగ్‌తో ప్రతిభకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న టోర్నీ నిర్వాహకులు

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసేందుకు గూడూరు రూరల్ క్రికెట్ కప్పు పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు జీఆర్‌సీసీ డైరెక్టర్ రాంగోపాల్ తెలిపారు. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలో శనివారం గ్రామీణ ప్రాంత క్రికెట్ సూపర్-30 పేరుతో క్రికెట్ పోటీలను ఎస్ఆర్ఐ జక్కంరెడ్డి శశాంక్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లలోపు ప్రతిభావంతులైన క్రికెట్ క్రీడాకారులను ఎంపిక చేస్తారు. వారికి సీనియర్ కోచ్‌ల ద్వారా 45 రోజుల పాటు శిక్షణ ఇప్పించి, వారిని రాష్ట్ర జట్టులో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఈ సూపర్-30 పేరుతో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన వారికి క్రికెట్ కిట్లను కూడా ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మస్తానయ్య, అవినాష్, బెంగుళూరు కోచ్‌లు రాజీవ్, దీపక్ మల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులతో కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య

సూళ్లూరుపేట : పట్టణంలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు కిమ్‌బెర్లీ క్లార్క్ యూఎస్ఏకి చెందిన మల్టీ నేషనల్ కంపెనీ శ్రీసిటీ వారిచే శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కంపెనీ మేనేజర్లు శ్రీకాంత్, అనూషా, హెచ్‌ఆర్ హోషువా ఇంటర్వ్యూ ద్వారా వివిధ విభాగాల నుంచి 25 మందిని ఇంటర్న్‌షిప్‌కి, 5 గురిని ఇంజినీరింగ్ అసోసియేట్లుగా ఎంపిక చేశారు. ఎంపికై న వారిని కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, ఏఓ మనోహర్ పాల్గొన్నారు.

బీమాతో జీవితానికి భరోసా



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

చిట్టమూరు: మండల పరిధిలోని పల్లంపర్తి గ్రామంలో ఎంపీడీఓ మనోహర్ గౌడ్ శనివారం ఉపాధి హామీ కూలీలకు భారత ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కూలీలకు పని పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సురక్ష భీమా యోజన, ప్రధాన జీవన జ్యోతిబీమా యోజన పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేశారు. 18–70 ఏళ్ల వయసు కలిగిన వారు ఏటా రూ.20 ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు బీమా నగదు వస్తుందన్నారు. అదేవిధంగా జీవిత బీమా కింద సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే పాలసీ కాలంలో ఏ కారణం చేత అయినా మరణం సంభవిస్తే రూ.2 లక్షలు చెల్లించడం జరుగుతదన్నారు. పాలసీ ప్రీమియం ప్రతి సంవత్సరం మే నెలలో తమ అకౌంట్ నుంచి డెబిట్ చేయబడుతుందన్నారు.

'మాకు స్మార్ట్ మీటర్ల వద్దు'



ఆటోలకు స్టికర్లు అంటిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరురూరల్ : "మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు..విద్యుత్ చార్జీల భారం తగ్గించండి'' అని సీపీఎం నేతలు ప్రచారం చేశారు. శనివారం వారు పట్టణంలో స్మార్ట్ మీటర్లు వద్దు అనే స్టికర్లను ఇంటింటికీ అంటించడంతో పాటు పట్టణంలోని ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీలను పెంచమని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని ప్రచారం చేసి.. ప్రజలతో ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. అయితే అధికారం చేపట్టిన వెంటనే వాటిని అమలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వేసవి కావడంతో ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ చార్జీల భారం పేదలపై రుద్దడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం పునరాలోచన చేసి పేదలపై వేసిన చార్జీల భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ(కార్యక్రమంలో పట్టణ సీఐటీయూ నాయకులు బీవీ రమణయ్య, ఆటో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే విజయశ్రీకి సమస్యలు విన్నవించుకుంటున్న గిరిజనులు

దొరవారిసత్రం: గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కెమిల్ సంస్థ నిర్వాహకులు గిరిజనుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజన ప్రజలు ఎదుర్కొనే సమస్యలను మండల స్థాయి అధికారులు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అలాగే కొన్ని ఎస్టీ కాలనీల్లో గిరిజనులకు పక్కాగృహాలు లేవని, వారు సాగు చేసుకుంటున్న భూముల విషయంలో ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని సంస్థ నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శైలజకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో మే 9వ తేదీన జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వివిధ కళాశాలల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులు సదస్సుకు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ రవీంద్రరెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయంలో చోరీ

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం పర్లకొండ మాతమ్మ ఆలయంలో చోరీ జరిగింది. వివరాలు.. శుక్రవారం రాత్రి మాతమ్మ ఆలయం హుండీని గుర్తుతెలియని దుండగులు అపహరించి.. అందులో ఉన్న నగదును కాజేశారు. ఆపై హుండీని సమీపంలోని ముళ్లపొదల్లో పడేశారు. ఆలయ అర్చకులు పుల్లయ్య శనివారం ఆలయం వద్దకు వెళ్లగా.. తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ రమణయ్య ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని మన్నేముత్తేరిలోని 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ శేఖర్ తెలిపారు. మన్నేముత్తేరి సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుక మిట్ట, కోళ్లమిట్ట, దేగల పాళెం, షార్ వైజంక్షన్, ప్రభుత్వ వైద్యశాల ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిలలక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి ఊంజల్‌సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు.



స్వామి,అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దుర్గామల్లేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని తిమ్మాజి కండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గా మల్లేశ్వరి దేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయంలో నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. దుర్గామల్లేశ్వరి అమ్మవారితో పాటు శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరి దేవి

వితంతు పింఛన్లకు అవకాశం

రాపూరు: మండలంలో 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్యన పింఛన్ పొందుతూ ఏదైనా కారణాలతో మరణించిన వ్యక్తి భార్యకు వితంతు పింఛన్ పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ భవాని శనివారం తెలిపారు. రాపూరు మండలంలో 119 మంది ఉన్నారని వారంతా ఆధార్, భర్త పింఛన్ పుస్తకం, గుర్తింపు కార్డు, మరణ ధ్రువీకరణపత్రంతో సమీపంలోని సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారికి మే 1 నుంచి పింఛన్ అందిస్తామని ఆమె వివరించారు.

తాగునీటి సరఫరా సిబ్బందితో సమీక్ష



తాగునీటి సరఫరా సిబ్బందితో సమావేశమైన కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేటటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని.. ఏదైనా సమస్య ఉంటే వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. శనివారం ఆయన తాగునీటి సరఫరా విభాగం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా పట్టణంలోని అన్ని ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీలో విలీనమైన జువ్వలపాళెం, విన్నమాల, బిరదవాడ, శ్రీనివాసపురం, బట్టీవిడత కాలనీ ప్రాంతాల్లో కూడా తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వర్ణముఖి నదిలో ఉన్న తాగునీటి మోటార్లు, పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న బోర్ల పరిస్థితిపై కమిషనర్ ఆరా తీశారు. తాగునీటిని వృథా చేయకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా మోటార్లు వేసే సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని.. సమయపాలన పాటించాలన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ గోపీ

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని మన్నూరు క్రాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముష్కరుల దాడి హేయనీయం



కశ్మీర్ మృతులకు సంతాపం తెలుపుతున్న సేవాసంస్థ సభ్యులు

చిల్లకూరు: కశ్మీర్‌లో అమాయకులను పొట్టన పెట్టుకున్న ముష్కరులను కఠినంగా శిక్షించడంతో పాటుగా అందుకు ప్రేరింపించిన పాకిస్తాన్‌కు భారత ప్రభుత్వం సరైన గుణపాఠం చెప్పాలని సునీత సేవా సంస్థ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం వారు గూడూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న సంస్థ కార్యాలయంలో వారు నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై ముష్కరులు దాడి చేయడం దారుణమన్నారు. టెర్రరిస్టులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సంస్థ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మసీదు కమిటీ మాజీ సభ్యుడు మృతి



హాజీ షేక్ రియాజ్(ఫైల్)

నాయుడుపేటటౌన్: నాయుడుపేట జామీయ మసీదు కమిటీ మాజీ సభ్యులు హాజీ షేక్ రియాజ్(52) మృతి పట్ల శనివారం పలువురు సంతాపం వ్యక్తం చేశారు. పట్టణంలో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారం నిర్వహించే రియాజ్ శనివారం తెల్లవారుజామున ఇంటి వద్ద అస్వస్థతకు గురవడంతో కుటుంబ స భ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రియాజ్ మృతి చెందినట్లు తెలిపారు. అందరితో సఖ్యతగా మెలిగే రియాజ్ మృతి చెందినట్లు తెలుసుకుని పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందుండే రియాజ్ మృతి పట్ల స్థానిక జామీయ మసీదు ముతవల్లీ హాజీ రహంతుల్లా సాహెబ్, మౌలానా అబూబకర్, అమరాగార్డెన్ మసీదు మైలానా పఠాన్ ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ, ఇతర పార్టీల నేతలు, మత పెద్దలు, నవ జవాన్ యువత సభ్యులు నివాళులు అర్పించారు.